సీఎం స్టాలిన్ పాలనాదక్షుడు

- ఆయన పథకాలన్నీ భేష్
- కేంద్రం సహా పలు సంస్థల కితాబు
- ఒక ప్రకటనలో తెలిపిన ప్రభుత్వం



చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ తరహా డీఎంకే పాలనలో అమలు చేస్తున్న పథకాలన్నీ భేషుగ్గా ఉన్నాయని, ఏ ముఖ్యమంత్రికి లేనంతగా ముఖ్యమంత్రి స్టాలిన్‌పై కేంద్ర ప్రభుత్వం, పలు సంస్థలు, ప్రముఖ పత్రికలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నాయని ఆదివారం ప్రభుత్వం విడుదల చేసిన ఓ సుదీర్ఘ ప్రకటనలో పేర్కొంది. స్టాలిన్ దీర్ఘ కాలిక ప్రయోజనాలు కల్పించేలా అమలు చేస్తున్న పథకాలన్నీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయంటూ విదేశాల్లో, ఐక్యరాజ్య సమితి సభల్లో ప్రశంసిస్తున్నారని ఆ ప్రకటనలో వివరించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాకున్నా ప్రజా సంక్షేమాన్ని ఏ మాత్రం విస్మరించకుండా స్టాలిన్ ఎన్నో పథకాలు అమలు చేసి పరిపాలనాదక్షుడిగాను నిలిచారని ప్రభుత్వం ఆ ప్రకటనలో తెలిపింది. అధికారంలోకి రాగానే కొవిడ్ లాక్‌డౌన్, వరదలు వంటి సమస్యలు ఎదురైనా, కేంద్రం నిధులు విదిలించకపోయినా స్టాలిన్ చేపట్టిన చర్యల కారణంగా ఆ రెండు ముప్పుల నుండి ప్రజలను బయటపడేశారని వివరించారు. దేశంలోనే అత్యుత్తమ ముఖ్యమంత్రిగా పలువురు ప్రశంసించినప్పుడు స్టాలిన్ జోక్యంచేసుకుని రాష్ట్రం దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా పేరుగడించినప్పుడే తనకు నిజమైన సంతోషం కలుగుతుందని వినమ్రంగా ప్రకటించుకున్నారు. ప్రస్తుతం సామాన్య ప్రజానీకం, ప్రత్యేకించి మహిళలు, విద్యార్థులు, కార్మికులు, పారిశ్రామికవేత్తలు, పత్రికా సంపాదకులు అంటూ అన్ని వర్గాల ప్రశంసలందుకున్న డీఎంకే ద్రావిడ తరహా పాలన నాలుగేళ్ల పూర్తిచేసుకుని ఐదో యేట అడుగుపెట్టబోతుందని, ఆ సమయంలోనూ స్టాలిన్ పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం ఖాయమని తెలిపారు. శాంతి భద్రతలను పరిరక్షించడంలో రాష్ట్రానికి బ్రిటిష్ స్టాండర్డ్స్ ఇన్‌స్టిట్యూషన్ ఐఎస్‌ఓ గుర్తింపునిచ్చిందని, క్రీడలను సమర్థవంతంగా నిర్వహించిన రాష్ట్రంగా ఫిక్కీ అంతర్జాతీయ సదస్సులో ప్రకటించారని, దివ్యాంగులకు అత్యుత్తమ సేవలందించే మొదటి రాష్ట్రంగా కేంద్ర ప్రభుత్వం అవార్డును ప్రదానం చేసిందని ఆ ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య సంరక్షణంలో రాష్ట్రం తృతీయ స్థానంలో ఉందని, పరి శుభ్రత పాటించే రాష్ట్రంగా రాష్ట్రపతి నుండి నగరపాలక శాఖ మంత్రి అవార్డు అందుకున్నారని, జలశక్తి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రంగా రాష్ట్రపతి అవార్డు లభించిందని, క్షయ వ్యాధిని నిర్మూలించడంలో రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందంటూ వారణాసిలో జరిగిన సదస్సులో రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలకు అవార్డులు ప్రదానం చేశారని, కాగితపు రహిత శాసనసభ పాలనవ్యవహారాలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారంటూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుండి అవార్డు లభించిందని, ఇలా కేంద్ర ప్రభుత్వం నుండి ఇలా వరుసగా అవార్డులు అందుకోవటం సాదాసీదా విషయం కాదని ఆ ప్రకటనలో ప్రభుత్వం పేర్కొంది. ప్రజలవద్దకే వైద్యం పథకం విజయవంతమైనందుకు యునైటెడ్ నేషన్స్ ఇంటర్ ఏజెన్సీ టాస్క్ ఫోర్స్ అవార్డు ప్రదానం చేసిందని, ఐక్యరాజ్య సమితి ప్రకటన ప్రకారం రాష్ట్రంలో సహకార సంఘాలు బ్యాంకు సేవలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నుండి అందుకున్న అవార్డు, ఇక బడిపిల్లలకు అమలు చేస్తున్న అల్పాహార పథకం, విద్యార్థినులకు పుదుమైపెణ్ పథకం, గృహిణులకు కలైంజర్ సాధికారిక నగదు పథకం, విద్యార్థులకు నాన్ ముదల్వన్ పథకం, మహిళలకు సిటీ, టవున్ బస్సులలో అమలు చేస్తున్న వెలుగుబాట పయనం పథకం అంటూ పలు పథకాలపై ప్రధాన ప్రసారమాధ్యమాలు, పత్రికలు ప్రశంసల వర్షం కురిపించినట్లు పేర్కొన్నారు.



బడిపిల్లల అల్పాహార పథకం ప్రారంభోత్సవంలో చిన్నారులతో సీఎం స్టాలిన్

కఠిన నిబంధనల నడుమ 'నీట్' ప్రశాంతం

- మానవత్వం చాటుకున్న పోలీసులు

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): యూజీ వైద్య కోర్సుల ప్రవేశానికి నిర్వహించే జాతీయ అర్హత పరీక్ష (నీట్) ఆదివారం కఠిన నిబంధనల నడుమ ప్రశాంతంగా సాగింది. దేశవ్యాప్తంగా వైద్య కోర్సుల ప్రవేశానికి నిర్వహించిన నీట్‌కు దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్రంలో 1.50 లక్షల మంది హాజరయ్యారు. రాజధాని నగరం చెన్నైలో 44 కేంద్రాలు, 31 జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు.



పరీక్ష కేంద్రం వద్ద క్యూలో ఉన్న విద్యార్థులు

కఠిన నిబంధనలు...

పరీక్షకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షా కేంద్రంలో పాటించాల్సిన నిబంధనలను గతంలోనే ప్రకటించారు. విద్యార్థులు ఫుల్ హ్యాండ్ షర్ట్ ధరించకూడదని, విద్యార్థినులు ముక్కుపుడకలు, చెవిదుద్దులు సహా ఆభరణాలు ధరించడంపై నిషేధించారు. పరీక్షా కేంద్రాల్లో ఉదయం 11 గంటలకు చేరుకున్న విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేసిన అనంతరమే అనుమతించారు. ఫుల్ హ్యాండ్ షర్ట్ ధరించి వచ్చిన విద్యార్థులకు అధికారులు అభ్యంతరం తెలుపడంతో, వారు బయటకు వచ్చి తమ తండ్రి ధరించిన హాఫ్ షర్ట్ ధరించి వెళుతున్న దృశ్యాలు పలు పరీక్షా కేంద్రాల వద్ద కనిపించాయి.



కమ్మలు తీస్తున్న విద్యార్థిని



షర్ట్ మార్చుకుంటున్న విద్యార్థి



కుమారుడి చేతికున్న దారాలు తొలగిస్తున్న తండ్రి



బొట్టు కూడా పరీక్షకు అడ్డమే ....

విద్యార్థులకు సాయం చేసిన పోలీసులు...

పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని నిబంధన విధించారు. మదురైలో ఓ విద్యార్థిని ఆధార్ కార్డు తీసుకురావడం మర్చిపోవడంతో, అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ విజయలక్ష్మి వెంటనే తన సెల్‌ఫోన్ నుంచి విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి ఆధార్ కార్డు తెప్పించారు. కోవైలో ఆధార్ కార్డు మరచిన విద్యార్థిని ఓ పోలీసులు సమీపంలోని నెట్ సెంటర్‌కు తీసుకెళ్లి ఆధార్ కార్డు డౌన్‌లోడ్ చేసి అందించారు. నామక్కల్ జిల్లా కుమారపాళయంలో పరీక్ష కేంద్రం తెలియక ఇబ్బంది పడుతున్న విద్యార్థినిని పోలీసులు తమ వాహనంలో పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు. కృష్ణగిరి జిల్లాకు చెందిన కార్మికుడు కుమార్తెకు ధర్మపురిలోని ఓ కళాశాలలో పరీక్షా కేంద్రం కేటాయించగా, ఆమె పొరపాటున సేలంలోని కళాశాలకు వెళ్లింది. ఆమె పరిస్థితిని గమనించిన పోలీసులు కారులో ఆమెను ధర్మపురికి పంపించారు. తిరుప్పూర్ తిరుమురుగన్‌పూండి పరీక్షా కేంద్రానికి వచ్చిన విద్యార్థిని ధరించిన దుస్తులకు అధిక బటన్స్ ఉన్నాయంటూ అధికారులు లోనికి అనుమతించలేదు. దీంతో విలపిస్తున్న విద్యార్థిని గమనించిన మహిళా పోలీసులు, విద్యార్థిని తమ ద్విచక్రవాహనంపై సమీపంలోని దుకాణానికి తీసుకెళ్లి కొత్త డ్రస్ కొనుగోలు చేసి మళ్లీ ఆమెను పరీక్షా కేంద్రానికి తీసుకొచ్చింది.



పరీక్ష కేంద్రం వద్ద తల్లిదండ్రులు

విద్యార్థిని ఆత్మహత్య...

చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూర్ సమీపం అగిలి గ్రామానికి చెందిన రైతు కుమార్తె కయల్‌విళి (17) ప్లస్ టూ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తోంది. ఆమె 'నీట్'కు కూడా దరఖాస్తు చేసుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు చదివిన ఆమె తన గదిలోకి వెళ్లింది. పరీక్షకు వెళ్లాల్సి ఉన్నందున తెల్లవారుజామున 4 గంటలకు కయల్‌విళి గది వద్దకు వెళ్లి పిలిచినా లోపలి నుంచి ఎలాంటి సమాధానం లేదు. దీంతో, చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు బద్దలుకొట్టి వెళ్లగా, ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన కుమార్తెను చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. సమాచారం అందుకుని ఘటనా స్థలానికి వెళ్లిన మేల్‌మరువత్తూర్ పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వర్షంతో అగ్నినక్షత్రం ఆరంభం

- చల్లబడిన రాజధాని నగరం



మెరీనాబీచ్ వద్ద కమ్ముకున్న కారుమేఘాలు

ప్యారీస్, మే 4 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసేలా అధిక ఎండలు కాసే అగ్నినక్షత్రం ఆదివారం ప్రారంభమైంది. ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగనున్న అగ్నినక్షత్రం ప్రభావంతో గతం కంటే ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని ప్రాంతీయ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఎండ తీవ్రత కారణంగా గాలిలో తేమ శాతం తగ్గుతుందని, అందువల్ల ప్రజలు బయటికి రావొద్దని రాష్ట్రప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో అగ్నినక్షత్రం ప్రారంభమైన ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పొరుగునే ఉన్న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో గత మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తర వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అయితే రాష్ట్రంలో మాత్రం ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీల అధికంగా నమోదవుతున్నాయి. వాతావరణంలో హఠాత్తుగా ఏర్పడిన మార్పుల వల్ల ఆదివారం సాయంత్రం నగరంలోని టి.నగర్, సైదాపేట, నుంగంబాక్కం, మైలాపూర్, అడయార్, తేనాంపేట, ఎగ్మూర్ తదితర ప్రాంతాల్లో దాదాపు 20 నిమిషాలు కురిసిన వర్షంతో నగరం చల్లబడింది. ఇదిలా వుండగా, డెల్టా జిల్లాల్లో వచ్చే మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ పరిశోధనా కేంద్రం తెలిపింది. సోమవారం పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం, కోవై, తిరునల్వేలి, నీలగిరి, తేని, తెన్‌కాశి, దిండుగల్ ప్రాంతాల్లో 7, 8 తేదీల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడుతాయని ఆ శాఖ వెల్లడించింది.

రాజ్యసభ సీటిస్తామని మభ్యపెట్టారు

- అన్నాడీఎంకేపై డీఎండీకే నేత సుధీష్ ఆరోపణ



ప్యారీస్, మే 4 (ఆంధ్రజ్యోతి): డీఎండీకేకు రాజ్యసభ సీటిస్తామని అన్నాడీఎంకే ఇచ్చిన హామీపై అనువైన సమయంలో వెల్లడించనున్నట్లు ఆ పార్టీ కోశాధికారి ఎల్‌కే సుధీష్ తెలిపారు. ఆయన ఆదివారం కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ మేరకు పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల వరకు అన్నాడీఎంకే కూటమిలోనే డీఎండీకే ఉందని, ఆ ఎన్నికల్లో బీజేపీ కూటమి నుండి అన్నాడీఎంకే వైదొలిగినప్పటికీ తమ పార్టీ మాత్రం కూటమిలోనే ఉంటూ రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసిందని తెలిపారు. ప్రస్తుతం బీజేపీ మళ్లీ అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకుందని, ఈ కూటమిలో మరికొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా చేరే అవకాశముందన్నారు. ఈ కూటమిలో చేరడంపై 2026 జనవరి 9న కడలూరులో నిర్వహించనున్న డీఎండీకే రాష్ట్రస్థాయి మహానాడులో పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. తమ పార్టీకి రాజ్యసభ సీటు ఇస్తామని అన్నాడీఎంకే ఇచ్చిన హామీ వాస్తవమేనని, దీనిపై సరైన సమయంలో అన్ని వివరాలను వెల్లడిస్తానని ఆయన తెలిపారు. రాజ్యసభ సీటు వస్తుందన్న నమ్మకంతోనే తాను 2024 పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయలేదని, అంతకు ముందు 2009లో జరిగిన ఎన్నికల్లో కళ్లకుర్చిలో, 2014లో సేలంలో పోటీ చేశానని, తనకు మద్దతుగా ప్రధాన నరేంద్ర మోదీ ప్రచారంలో పాల్గొన్నారని తెలిపారు. వచ్చే ఏడాది అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో పార్టీ అధిష్టానం తనకు అవకాశం కల్పిస్తే పోటీచేస్తానని తెలిపారు. రాజ్యసభ సీటు వ్యవహారంపై అన్నాడీఎంకే నేతలతో చర్చించడంపై పార్టీ అధిష్టానం పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందని సుధీష్ తెలిపారు.

స్టాలిన్‌కు ఓటమి భయం

- బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్



చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోతామనే భయం పట్టుకుందని, అందుకే ఎమ్మెల్యేలను, మంత్రులను వారి నియోజకవర్గాలకు వెళ్ళమని చెబుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ విమర్శించారు. తిరునల్వేలి పెరుమాళ్‌పురంలో ఆదివారం ఉదయం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా డీఎంకే ఎమ్మెల్యేలు, మంత్రులంతా వారి నియోజకవర్గాల ప్రజల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోకుండా రాజధానిలోనే విలాసవంతంగా గడిపారనే విషయం పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశంలో మాట్లాడిన తీరు స్పష్టం చేస్తోందన్నారు. అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తుకుదుర్చుకోవడాన్ని స్టాలిన్ అదే పనిగా విమర్శిస్తుండం కూడా ఓటమి భయం వలనేనని స్పష్టమవుతోందన్నారు. డీఎంకే కూటమిలోనే ప్రస్తుతం అసమ్మతి సెగలు అధికమయ్యాయని, అసెంబ్లీ ఎన్నికలు సమీపించే సమయంలో మిత్రపక్షాలు ఒక్కొక్కటిగా కూటమి నుండి వైదొలగటం ఖాయమన్నారు. గత రెండేళ్లకు పైగా గవర్నర్‌పై అదేపనిగా విమర్శలు చేసిన స్టాలిన్ ప్రస్తుతం ఆయనతో వ్యక్తిగత విరోధాలు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. డీఎంకే నేతలు ఎన్ని జిమ్మిక్కులు చేసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూడటం తప్పదని నాగేంద్రన్ అన్నారు. మీడియా సమావేశంలో బీజేపీ తిరునల్వేలి జిల్లా నేతలు పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారులు

- రెండు ప్రమాదాల్లో ఆరుగురి దుర్మరణం
- బస్సును వ్యాన్ ఢీకొని నలుగురు
- గోతిలో బైకు బోల్తాపడి దంపతులు

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు, తిరుప్పూరు జిల్లాల్లో ఆదివారం వేకువజామున సంభవించిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. కేరళ రాష్ట్రం తిరువనంతపురం నుండి స్నేహితులైన సాజినాథ్, సాబు, సుజిత్, రాజేష్, రాహుల్, రెజినేషన్, మరో వ్యక్తి కలిసి నాగపట్టినం జిల్లా వేలాంకన్నికి విహారయాత్ర కోసం ఆమ్నీ వ్యాన్‌లో బయలుదేరారు. ఆదివారం వేకువజామున తిరువారూరు జిల్లా తిరుత్తురైపూండి వద్ద వ్యాన్ అదుపు తప్పి నాగపట్టినం నుంచి రామనాథపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ దుర్ఘటనలో వ్యాన్‌లో ప్రయాణించిన సాజినాథ్, రాజేష్, సుజిత్, రాహుల్ ఘటనా స్థలంలోనే మరణించగా, తక్కిన ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన పాదచారులు వెంటనే ఫిర్యాదు చేయడంతో పోలీసులు హుటాహుటిన చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుత్తురైపూండి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరువారూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించిన ఎడయూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

సీఎం సంతాపం...

తారాపురం వద్ద ఫ్లైఓవర్ కోసం తవ్విన గోతిలో బైకు పడిన ప్రమాదంలో నాగరాజ్, ఆనంది అనే దంపతులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందానని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఓ ప్రకటన జారీ చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తలా రూ.3లక్షల ఆర్థిక సాయం, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దీక్షితకు మెరుగైన చికిత్సలందించడానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు.

గోతిలో బైకు బోల్తా...

తిరుప్పూరు జిల్లా గుండం సమీపం కుళ్లయాపాళయం వద్ద ఫ్లైఓవర్ కోసం తవ్విన పదడుగుల గోతిలో మోటారు బైకు బోల్తాపడి దంపతులు దుర్మరణం చెందారు. వారి కుమార్తె తీవ్రంగా గాయపడింది. తిరుప్పూరు జిల్లా కుండం సమీపం సేర్వకారన్ పాళయంలో నాగరాజ్ (44), ఆనంది (38) దంపతులకు దీక్షిత (12) అనే కుమార్తె ఉంది. ఈ ముగ్గురూ శనివారం మధ్యాహ్నం తిరునళ్లారు శనీశ్వరాలయానికి వెళ్ళి దర్శనానంతరం రాత్రి బస్సులో తారాపురం బస్‌స్టేషన్ చేరుకున్నారు. బస్టాండ్‌లో పార్కింగ్ బైకుపై నాగరాజ్ భార్య, కుమార్తెను కూర్చోబెట్టుకుని స్వస్థలానికి బయలుదేరారు. తారాపురం - ఊదియూరు రహదారిలో కుల్లయాపాళయం వద్ద ఫ్లైఓవర్ కోసం తవ్విన పది గోతిలో బైకు బోల్తా పడింది. దీంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. రాత్రంతా ఆ ముగ్గురూ గోతిలో పడి ఉండటాన్ని ఎవరూ గమనించలేకపోయారు. ఆదివారం వేకువజామున గాయాల కారణంగా అధిక రక్త స్రావంతో నాగరాజ్, ఆనంది ప్రాణాలు కోల్పోయారు. దీక్షిత తీవ్రగాయాలతో కొన ఊపిరితో ఉండగా ఆ మార్గంలో వెళుతున్న పాదచారులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెనువెంటనే అక్కడికిచేరుకుని దీక్షితను చికిత్స నిమిత్తం తారాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టంకు పంపించారు.. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరిగే చోట ఎలాంటి హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపించారు. ఫ్లైఓవర్ నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మృతిచెందిన నాగరాజు, ఆనంది (ఫైల్‌ఫొటో)



కన్నియాకుమారి జిల్లా వెళ్లిమలైలో కంచి శంకర విద్యాలయ మెట్రిక్యులేషన్ స్కూలులో ఆదివారం జరిగిన నూతన భవనం ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి

సమాచార దృష్టి

'మల్టీ ఆక్సిల్' బస్సుల కొనుగోలు

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ ఆధ్వర్యంలో 1,080 డీలక్స్ 'ఏసీ' బస్సులు నడుపుతున్నారు. తొలిసారిగా ఈ సంస్థ 'మల్టీ ఆక్సిల్' లగ్జరీ బస్సులు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. తొలివిడతగా 20 బస్సుల కోసం టెండర్లు ఆహ్వానించింది. ఒక్కో బస్సు ఖరీదు రూ.1.15 కోట్లు. ఒకే సమయంలో 55 మంది ప్రయాణించవచ్చు. లగ్జరీ సీట్లు, ఏసీ వసతి, మొబైల్ ఫోన్ ఛార్జింగ్, వైఫై తదితర వసతులతో మల్టీ ఆక్సిల్ లగ్జరీ బస్సులుంటాయని అధికారులు తెలిపారు.

8న తిరుచ్చిలో స్టాలిన్ రోడ్‌షో

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం ఈ నెల 8న తిరుచ్చి నగరానికి వెళుతున్నారు. రెండు రోజులపాటు ఆయన తిరుచ్చి నగరంలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు. అదే సమయంలో ఆ నగరంలో రెండు రోడ్‌షోలు జరుపనున్నారు. ఈ నెల 8 సాయంత్రం తిరుచ్చి ధిల్లైనగర్, తెన్నూరు జంక్షన్, కలైంజర్ అరివాలయం దాకా ఆయన రోడ్‌షోలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

స్థానిక ఎన్నికలకు ఈవీఎంలు

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో ఖాళీ పదవులకు నిర్వహించనున్న ఎన్నికల్లో ఈవీఎంలు వినియోగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. చెన్నై కార్పొరేషన్‌లో నాలుగు కార్పొరేటర్ పదవులు, 35 జిల్లాల్లోని మున్సిపాలిటీ, పంచాయతీల్లోని 133 ఖాళీ పదవులు, కాంచీపురం, చెంగల్పట్టు, వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్, విల్లుపురం, కళ్లకుర్చి, తిరునల్వేలి, తెన్‌కాశి తదితర 9 జిల్లాల్లోని స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న మొత్తం 452 పదవులకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలు ఈ నెలాఖరులోగా నిర్వహించాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. ఈ నేపథ్యంలో, ఈ ఎన్నికల్లో ఈవీఎంలు వినియోగించనున్నట్లు, అందుకు అవసరమైన ఈవీఎంలు సిద్ధం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారులకు ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది.

కళ్లలగర్ ఉత్సవాల కోసం 8న వైగై డ్యామ్ జలాల విడుదల

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): మదురై చిత్తిరై వేడుకల సందర్భంగా వైగై డ్యాం నుంచి నీరు విడుదల చేయనున్నారు. మదురై చిత్తిరై వేడుకల్లో వైగై నదిలో కళ్లలగర్ ఆగమనం వైభవం జరుగనుంది. ఈ సమయంలో వైగై నదిలో తగినంత నీరు లేని పక్షంలో, వైగై డ్యాం నుంచి జలాలను విడుదల చేస్తుంటారు. ఆ ప్రకారం, ఈ ఏడాది మదురై చిత్తిరై ఉత్సవాలు కోలాహలంగా జరుగనుండటంతో ఆ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన వైగైనదిలో కళ్లలగర్ ఆగమన వేడుకలు ఈ నెల 12న జరుగనుంది. ప్రస్తుతం వైగై నదిలో తగినంత జలాలు లేకపోవడంతో వైగై డ్యాం నుంచి నీరు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, ఈ నెల 8 సాయంత్రం 6 గంటలకు జలాలను విడుదల చేయనున్నారు. ప్రారంభంలో సెకనుకు వెయ్యి ఘనపుటడుగుల చొప్పున విడుదల చేయనున్నామని, ఆ తర్వాత క్రమంగా తక్కువ పరిమాణంలో జలాల విడుదల చేయనున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అన్ రిజర్వ్‌డ్ బోగీలు

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): చెన్నై-తంజావూరు, కొల్లం సహా నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా అన్ రిజర్వ్‌డ్ బోగీ అనుసంధానం చేయనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై ఎగ్మూర్-తంజావూరు-చెన్నై ఎగ్మూర్ 'ఉళవన్' ఎక్స్‌ప్రెస్ రైళ్లు, చెన్నై ఎగ్మూర్-కొల్లం-చెన్నై ఎగ్మూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జూన్ 1 నుండి అదనంగా ఒక్కో అన్ రిజర్వ్‌డ్ బోగీ అనుసంధానం చేయనున్నారు. అలాగే, నాగర్‌కోయిల్- కాచిగూడ-నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జూన్ 5వ తేదీ, చెన్నై ఎగ్మూర్-కొల్లం-చెన్నై ఎగ్మూర్ 'ఆనందపురి' ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జూన్ 2వ తేది నుంచి తలా ఒక అన్‌రిజర్వ్‌డ్ బోగీ అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

ఎస్‌ఐ పోస్టులకు దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో 1,299 ఎస్‌ఐ పోస్టుల భర్తీకి యూనిఫాం ఉద్యోగుల ఎంపిక బోర్డు ఏప్రిల్ 4న నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు గడువు సోమవారంతో ముగియనున్న నేపథ్యంలో, బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... 9వ తరగతి చదవకుండా నేరుగా 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు, ప్లస్ టూ చదవకుండా ప్లస్ టూ ఉత్తీర్ణులై వారు ఆన్‌లైన్, నేరుగా దరఖాస్తులు సమర్పించవచ్చని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీచేసిందన్నారు. ఆ ప్రకారం, ఆ పరిస్థితులో వారు ఆన్‌లైన్ ద్వారా వినతిపత్రాలు సమర్పించవచ్చు. న్యాయస్థానం తుది తీర్పు వెలువడే వరకు అలాంటి దరఖాస్తులను తాత్కాలికంగా పక్కన ఉంచనున్నట్లు తెలిపింది. అన్ని రకాల అభ్యర్థుల దరఖాస్తు స్వీకరణ సోమవారం ముగియనుండగా, అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 10 వరకు పొడిగించినట్లు, దరఖాస్తులో పేర్కొన్న వివరాల్లో లోపాలు ఉంటే ఈ నెల 15 లోపు సరిచేసుకోవచ్చని బోర్డు తెలిపింది.

అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె వాపస్

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ ఉద్యోగులు సమ్మె విరమించారు. ఈ విషయమై రాష్ట్ర అంగన్వాడీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రత్నమాల విడుదల చేసిన ప్రకటనలో... వేసవి సెలవులు, పదోన్నతి, ఖాళీ పోస్టుల భర్తీ తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగులు, సహాయకులు రెండు రోజులుగా సమ్మె చేపట్టారన్నారు. తమ డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 22న సంఘ ప్రతినిధులతో చర్చలు జరుపున్నట్లు మంత్రి గీతా జీవన్ ప్రకటించారని, మంత్రి ప్రకటన మేరకు సమ్మె తాత్కాలికంగా విరమించుకుంటున్నామన్నారు. 22న జరిగే సమావేశంలో అధికారుల వివరణ బట్టి తదుపరి ఆందోళనలపై నిర్ణయం తీసుకుంటామని రత్నమాల తెలిపారు.

మద్యం మత్తులో డ్రైవింగ్

- స్నేహితుడి మృతి
- ఏడుగురుకి తీవ్రగాయాలు



దెబ్బతిన్న కారు





(ఇన్‌సెట్లో) అరెస్టయిన రామనాథప్రభు, కారు ఢీకొని మృతి చెందిన శాంతయ్య

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): తన కారు దెబ్బతినటానికి కారణమైన లారీ డ్రైవర్‌కు మద్దతుగా స్థానికులు వ్యవహరించానే కోపంతో, పీకలదాకా తాగిన మద్యం మత్తులో ఓ యువకుడు వారి మీద కారు నడిపి తీవ్ర భయందోళనలకు గురిచేశాడు. ఆ కారు ఢీకొనడంతో అతడి స్నేహితుడు దుర్మరణం చెందాడు. మరో ఏడుగురు తీవ్రవంగా గాయపడ్డారు. రామనాతపురం తెర్కుతరవై ప్రాంతంలో నివసిస్తున్న రామనాథ ప్రభు, అదే ప్రాంతానికి చెందిన శాంతయ్య మరికొందరితో కలిసి శనివారం రాత్రి మద్యం తాగాడు. ఆ తర్వాత పళని, శివా, శాంతయ్యను వెంటబెట్టుకుని కారులో బయలుదేరాడు. పోలీసు సాయుధదళ క్వార్టర్స్ వద్ద వెళుతుండగా ఆ కారును ఉప్పులోడుతో వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆగ్రహించిన ప్రభు లారీ డ్రైవర్ కార్తీతో గొడవ పడ్డాడు. ఆ సందర్భంగా స్థానికులు వారి మధ్య రాజీ కుదిర్చారు. తాగిన మైకంలో ప్రభు రాంగ్‌సైడ్‌లో కారు నడపటం వల్లే లారీ తగిలిందని స్థానికులు ఆరోపించారు. అది విన్న రామనాథ ప్రభుకు స్థానికులు లారీ డ్రైవర్‌కు అనుకూలంగా మాట్లాడటంతో ఆగ్రహించాడు. గొడవలు సద్దుమణిగిందని శాంతయ్య, శివా సహా పదిహేను మంది నడచి వెళ్తుండగా ప్రభు కారును వేగంగా నడిపి ఆ జనాన్ని ఢీకొట్టాడు. అదే సమయంలో కారును రివర్స్ తీసుకెళ్లి మళ్ళీ వారిని ఢీకొట్టి అక్కడి నుండి పారిపోయాడు. ఈ దుర్ఘటనలో శాంతయ్య తీవ్రంగా గాయపడి ఆ స్థలంలోనే మృతి చెందాడు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. చుట్టుపక్కలవారు అక్కడికి వచ్చి తీవ్రంగా గాయపడిన ఏడుగురిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు రామనాథప్రభును అరెస్టు చేసి, రహస్య ప్రదేశానికి తీసుకెళ్ళి విచారణ జరుపుతున్నారు. ప్రభు ఆచూకీ తెలిస్తే స్థానికులంతా అతడిపై దాడి చేస్తారనే అనుమానంతో పోలీసులు అతడిని రహస్య ప్రాంతానికి తీసుకెళ్ళినట్లు చెబుతున్నారు.

సహకార బ్యాంకుల ద్వారా రూ.17వేల కోట్ల పంట రుణాలు

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకుల ద్వారా రూ.17వేల కోట్ల పంట రుణాలు, రూ.3వేల కోట్ల పశు సంరక్షణ రుణాలు అందించాలని సహకార శాఖ ఉత్తర్వులు జారీచేసింది. సహకార శాఖ ఆధ్వర్యంలోని సహకార బ్యాంక్‌ల, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పంటలు, నగలు తదితర విభాగాల్లో రుణాలు అందజేస్తున్నాయి. ఆ ప్రకారం, రైతులకు 7 శాతం వడ్డీతో పంట రుణాలు అందిస్తోంది. నిర్ణీత కాలంలో రుణం చెల్లించిన వారికి, వడ్డీ పూర్తిగా మాఫీ చేస్తున్నాయి. ఈ క్రమంలో, సహకార సంస్థలు ఈ ఆర్థిక సంవత్సరం అన్ని విభాగాలు కలిపి రూ.1.10 లక్షల కోట్ల రుణాలు మంజూరుచేయనున్నట్లు ఇటీవల శాసనసభ సమావేశాల్లో సహకార శాఖ మంత్రి పెరియకరుప్పన్ ప్రకటించారు. ఆ ప్రకారం, ఒక్కో విభాగంలో ఇచ్చే రుణాల వివరాలను సహకార శాఖ తయారుచేసింది. ఆ ప్రకారం, రూ.17వేల కోట్ల పంట రుణాలు, రూ.3వేల పశు సంరక్షణ రుణాలు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, గత ఏడాది 17.37 లక్షల మంది రైతులకు పంట రుణాలుగా రూ.15,692 కోట్లు, 4.43 లక్షల మందికి రూ.2,645 కోట్ల పశు సంరక్షణ రుణాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

కల్లాలంగుడి జల్లికట్టులో అపశ్రుతి

- 40 మందికి గాయాలు
- రెండు పోట్లగిత్తల మృతి



మైదానంలో రంకెలేస్తున్న పోట్లగిత్త

ప్యారీస్, మే 4 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా కల్లాలంగుడి ప్రాంతంలో నిర్వహించిన జల్లికట్టులో పోట్లగిత్తలు కుమ్మడంతో 40 మందికి గాయాలయ్యాయి. ఈ గ్రామంలోని ముత్తుమారి అమ్మన్ ఆలయంలో జరుపుకుంటున్న చిత్తిరై ఉత్సవాల్లో భాగంగా ఆలయం తరుపున శనివారం జరిగిన జల్లికట్టు పోటీలను తహసీల్దార్ అక్బర్ అలీ జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో పుదుకోట, తిరుచ్చి, మదురై తదితర జిల్లాల చెందిన 691 ఎద్దులతో వాటి యజమానులు పాల్గొన్నారు. మైదానంలో రంకెలేస్తూ పరుగులు తీస్తున్న పోట్లగిత్తలను అదుపు చేసేందుకు 250 మంది యువకులు ప్రయత్నించారు. ఎద్దులు కుమ్మడంతో 40కి గాయాలు కాగా, వారిలో 10 మందిని ఆలంగుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జల్లికట్టులో వాడివాసల్ గుండా మైదానంలోకి వదిలిన ఎద్దుల్లో మేలత్తూరుకు చెందిన రాజేంద్రకు చెందిన ఎద్దు బావిలో జారిపడి మరణించింది. అదేవిధంగా తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌కు చెందిన శివ ఎద్దు మెడలో తాడు చెట్టుకు తగులుకోవడంతో కిందపడి మృతిచెందింది. కాగా, మూడు నెలలకు పైగా శ్రమించి ఏర్పాటుచేసిన ఈ జల్లికట్టు పోటీలకు తగిన భద్రత కల్పించడంలో పోలీసులు నిర్లక్ష్యం చూపారని జల్లికట్టును తిలకించిన ప్రేక్షకులు ఆరోపించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించే పాఠశాలల వివరాలు సమర్పించాలి

పెరంబూర్ మే 4 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షా ఫలితాలు త్వరలో వెలువడనున్న నేపథ్యంలో, వంద శాతం ఉత్తీర్ణత సాధించే పాఠశాలల వివరాలు పంపాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశం చింది. ఈ మేరకు జిల్లా ప్రధాన విద్యాధికారులకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కన్నప్పన్ పంపిన సర్క్యులర్‌లో... రాష్ట్రంలో 3,088 ఉన్నత, 3,174 మహోన్నత పాఠశాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేలా పలు చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా ఇటీవల టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందించనున్నట్లు శాసనసభలో గత నెల 25వ తేది విద్యాశాఖ మంత్రి ప్రకటించారన్నారు. ఆ ప్రకారం త్వరలో విడుదల కానున్న టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల వివరాలకు ఫలితాలు విడుదలైన 10 రోజుల్లోగా పంపించాలని ఈ విషయంలో జిల్లా ప్రధాన విద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యాశాఖ కోరింది.

మూడు వర్సిటీలకు వీసీల సెర్చి కమిటీ

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు డా.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, తంజావూరు తమిళ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే సెర్చి కమిటీలు ఏర్పాటుచేసింది. శాసనసభలో నెరవేర్చిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలుపపోవడాన్ని ఖండిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పు ఆధారంగా వైస్ ఛాన్సలర్ లేని విశ్వవిద్యాలయాలు, పదవీకాలం పెంచిన విశ్వవిద్యాలయాలకు కొత్తగా వైస్ ఛాన్సలర్ల ఎంపికకోసం ప్రభుత్వం సెర్చి కమి టీలను ఏర్పాటుచేస్తోంది. ఆ ప్రకారం తిరుచ్చి భారతి దాసన్ విశ్వవిద్యాలయం, సేలం పెరియార్ విశ్వవిద్యాలయం, కోవై భారతియార్ విశ్వవిద్యాలయం వీసీల కోసం సెర్చి కమిటీలు నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ముగ్గురు సభ్యులతో కూడిన ఈ కమిటీలు సిఫారసు చేసే ముగ్గురిలో ఒకరిని వైస్ ఛాన్సలర్‌గా నియమిస్తుందని అధికారులు తెలిపారు.

కొడైకెనాల్‌లో హఠాత్తుగా విజయ్ రోడ్‌షో

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లో సినిమా షూటింగ్ కోసం వెళ్ళిన తమిళగవెట్రి కళగం (టీవీకే) నేత, నటుడు విజయ్ ఆదివారం ఆకస్మికంగా రోడ్‌షో జరిపారు. కొడైకెనాల్ కీళ్‌మలై గ్రామమైన తాండికుడి పరిసర ప్రాంతాల్లో ఆయన ఓపెన్ టాప్ జీపులో నిలబడి రహదారికి ఇరువైపులా ఉన్న అభిమానుల వైపు చేతులు ఊపుతూ వెళ్ళారు. ఇదే విధంగా శనివారం సాయంత్రం షూటింగ్ ముగిసినప్పుడు కూడా విజయ్ ఇదే విధంగా రోడ్‌షో జరిపారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు షూటింగ్ ముగించుకుని విజయ్ చెన్నై బయలుదేరనున్నారు. ఆ సమయంలోనూ ఆయన రోడ్‌షో చేస్తారని అభిమానులు భావిస్తున్నారు.



తాండికుడి గిరిజన గ్రామంలో రోడ్‌షో చేస్తున్న విజయ్

యుద్ధాలు కోరుకునేవారికి నష్టాలు తప్పవు

- ఎండీఎంకే నేత వైగై

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): యుద్ధానికి మద్దతు తెలిపేవారు దాని నష్టాలు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుదని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగై తెలిపారు. కోవై విమానాశ్రయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పహల్గాంలో 26 మంది ప్రజలు ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందడం బాధాకరమన్నారు. అదే సమయంలో ముస్లిం యువకులు ధైర్యంగా వ్యవహరించి, పలువురి ప్రజల ప్రాణాలు రక్షించడం ఊరట కలిగించే అంశమన్నారు. ఇలాంటి అంశాలు మీడియాలో రాలేదన్నారు. కేంద్ర మంత్రివర్గంలోని కొందరు యుద్ధం ప్రారంభించాలని కోరుతున్నారన్నారు. కానీ యుద్ధం అనేది అంత సులభమైన విషయం కాదని తెలిపారు. యుద్ధాలు జరిగితే అమాయకులైన ప్రజలు ప్రాణాలు కోల్పోతారన్నారు. ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో పడే అవకాశముందన్నారు. పాకిస్థాన్ కూడా ఉగ్రవాదం నిర్మూలనకు మద్దతు ఇవ్వాలని, ప్రపంచ దేశాలు ఈ విషయమై ఒత్తిడి చేయాలని కోరారు. ఐటీ, ఈడీ విభాగాలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని, ఈ రెండు సంస్థలపై ప్రజలు నమ్మకం కోల్పోయారన్నారు. నీట్ నుంచి మినహాయింపు కోసం డీఎంకే ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తుందన్నారు. డీఎంకే నాలుగేళ్ల పాలనలో ఎన్నికల హామీలు నెరవేర్చిందన్నారు. ద్రావిడ మోడల్ పాలన సంతృప్తికరంగా ఉందని వైగో తెలిపారు.

పెనుగాలులకు కూలిన పూందమల్లి థియేటర్ పైకప్పు



చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లో ఆదివారం పెనుగాలులలో కూడిన వర్షం కురిసింది. దీంతో పూందమల్లిలో ఉన్న సంతోష్ థియేటర్ పైకప్పులో కొంత భాగం కూలిపడింది. ఆ సమయంలో థియేటర్‌లో సినిమా చూస్తున్న ప్రేక్షకులంతా పైకప్పు కూలిన శబ్దానికి భయంతో నలువైపులా పరుగెత్తారు. ప్రేక్షకులందరినీ థియేటర్ యజమానులు, నిర్వాహకులు, పోలీసులు థియేటర్ లోపల నుండి బయటకు సురక్షితంగా తీసుకొచ్చారు. ఆ తర్వాత థియేటర్‌ను మూసివేశారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి పల్లకీ సేవ





తిరుత్తణి, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ క్షేత్రంలో గురువారం నుండి ప్రారంభమైన చిత్తిరై బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం శ్రీవళ్ళీ, దేవసేన సమేతుడై సుబ్రహ్మణ్య స్వామి పల్లకీలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఉత్సవమూర్తులను అలంకరించిన పల్లకీలో కొలువుదీర్చి భక్తులకు దర్శనం కల్పించారు.

మరమ్మతులకు గురైన రైలింజన్

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): రైలింజన్ మరమ్మతులకు గురై ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రామేశ్వరం నుంచి సాయంత్రం 5.30 గంటలకు చెన్నైకు ఎక్స్‌ప్రెస్ బయల్దేరుతుంది. శనివారం యధావిధిగా బయల్దేరిన రైలు శివగంగకు రాత్రి 7.40 గంటలకు రావాల్సి ఉండగా, 20 నిమిషాలు ఆలస్యంగా వచ్చింది. రైలు ప్లాట్‌ఫారం మధ్యలో హఠాత్తుగా రైలింజన్ మరమ్మతులకు గురై నిలిచిపోయింది. సగం బోగీలు ప్లాట్‌ఫారంపై నిలిచిపోగా, మరికొన్ని స్టేషన్ వెనుక ఉన్న వంతెన వరకు ఆగిపోయాయి. సమాచారం అందుకున్న అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని రైలింజన్‌కు మరమ్మతులు చేపట్టగా అవి ఫలించలేదు. దీంతో కారైక్కుడి నుంచి మరో రైలింజన్ రప్పించి గంటన్నర ఆలస్యంగా శివగంగ స్టేషన్ నుంచి రైలు బయల్దేరి వెళ్లింది.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం



ప్రజలకు పుచ్చకాయ ముక్కలు పంపిణీ చేస్తున్న జయకుమార్

ప్యారీస్, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరం సీఎండీఏ ట్రక్ టెర్మినల్ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మాధవరం ట్రక్ టెర్మినల్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సరుకుల లోడు నగరానికి, శివారు ప్రాంతాలకు తరలించే లారీలను మాదవరం ట్రక్ టెర్మినల్‌లో పార్కింగ్ చేస్తుంటారు. ఈ లారీల డ్రైవర్లు, క్లీనర్లు, కూలీల దాహారి తీర్చే నిమిత్తం ఏర్పాటు చేసిన చలివేంద్రం లారీ యూనియన్ అధ్యక్షుడు లయన్ వీజీ జయకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఆర్‌కే దక్షిణామూర్తి, ట్రెజరర్ మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.


సౌత్‌జోన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ విజేతలు ఆంధ్ర, తమిళనాడు



కప్ అందుకున్న తమిళనాడు బాలుర జట్టు

నెల్లూరు(విద్య), మే 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రెండు రోజులపాటు జరిగిన సౌత్ అండర్-14 బాల, బాలికల టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు, బాలుర విభాగంలో తమిళనాడు జట్టు చాంపియన్లుగా నిలిచాయి. ఫైనల్స్‌లో బాలికల విభాగంలో ఆంధ్రపదేశ్, తమిళనాడు జట్లు తలపడగా ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానం, తమిళనాడు ద్వితీయ స్థానం సాధించాయి. బాలుర విభాగంలోనూ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్లు తలపడగా తమిళనాడు ప్రథమ స్థానం, ఆంధ్రప్రదేశ్ ద్వితీయ స్థానం సాధించాయి. ఎన్జీవో హోమ్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో విన్నర్స్, రన్నర్స్‌కు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టెన్నిస్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్‌డీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు యుగంధర్, నిర్వాహక కార్యదర్శి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాత సామాన్ల దుకాణంలో అగ్నిప్రమాదం



మంటల్లో దగ్ధమవుతున్న వస్తువులు

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జాతీయ రహదారిలో విరాలిమలై వద్ద పాత ఇనుము దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. నగర పంచాయతీ మాజీ అధ్యక్షుడు రవి నడుపుతున్న పాత ఇనుముల దుకాణంలో ఆదివారం మధ్యాహ్నం సంభవించిన అగ్ని ప్రమాదంలో రూ.2లక్షల విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో ఇనుప, ప్లాస్టిక్ వస్తువులు, పాత వైర్లు, ప్లాస్టిక్ బాటిల్స్, పాతపేపర్లు దగ్ధమయ్యాయి. ఆ దుకాణం వద్ద కార్మికులు ఇనుప వలలను అమర్చుతుండగా రాపిడికి నిప్పురవ్వలు వచ్చి ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

బాలికకు లైంగిక వేధింపులు

- పోక్సో చట్టం కింద వృద్ధుడి అరెస్ట్

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వృద్ధుడు పోక్సో చట్టం కింద కటకటాలపాలయ్యాడు. సేలం జిల్లా నాళిక్కల్‌పట్టికి చెందిన వృద్ధుడు (78) కొద్దిరోజుల క్రితం అదే ప్రాంతంలోని పూల తోటకు వెళ్లాడు. అక్కడ ఏడేళ్ల బాలిక తల్లిదండ్రులతో కలసి పూలు కోసేందుకు వచ్చింది. ఆ వృద్ధుడు కూడా కొద్దిసేపు బాలికతో కలసి పూలు కోశాడు. కొద్దిసేపటి తరువాత తల్లిదండ్రులు ఇంటికి వెళ్లడంతో ఒంటరిగా ఉన్న బాలికపై వృద్ధుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఇంటికి వెళ్లిన బాలిక తల్లిదండ్రులకు ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో కొండలాంపట్టి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారించిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి వృద్ధుడిని అరెస్ట్ చేసి సేలం కోర్టులో హాజరుపరచి కేంద్ర కారాగారానికి తరలించారు.

చెట్టును ఢీకొన్న బస్సు.. డ్రైవర్ మృతి



రామ్మూర్తి నాయుడు (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) బస్సు చెట్టును ఢీకొన్న ఘటనలో చికిత్స పొందుతున్న డ్రైవర్ మృతిచెందాడు. గురువారం మధ్యాహ్నం పళ్లిపట్టు-షోలింగర్ జాతీయ రహదారిలో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన తిరుపతికి చెందిన బస్సు డ్రైవర్ రామ్మూర్తి నాయుడు (53)సహా పది మందిని పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో రెండ్రోజులుగా చికిత్సపొందుతున్న బస్సు డ్రైవర్ రామ్మూర్తి శనివారం సాయంత్రం చికిత్స ఫలించకపోవడంతో మృతిచెందాడు.

మళ్లీ సముద్రంలోకి పైపులు



కొట్టుకొచ్చిన భారీ పైపులను సముద్రంలోకి తరలిస్తున్న దృశ్యం

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపం నెమ్మేలిలో తీరానికి కొట్టుకొచ్చిన భారీ పైపులను మళ్లీ సముద్రంలోకి చేర్చారు. కొత్త తాగునీటి కర్మాగారం కోసం సముద్రంలో ఏర్పాటుచేసిన సుమారు 1,500 మీటర్ల పొడవైన భారీ పైపులు కొద్దిరోజుల క్రితం సముద్ర వాతావరణం అల్లకల్లోలంగా ఉండడంతో తీరానికి కొట్టుకొచ్చాయి. దీంతో రెండు 'టగ్ బోట్'ల సాయంతో మళ్లీ సముద్రం దిగువ భాగానికి చేర్చినట్లు అధికారులు తెలిపారు.

మేల్‌మరువత్తూరులో గురుపూజతో చిత్రా పౌర్ణమి ఉత్సవాలు ప్రారంభం



యాగశాల పూజతో పౌర్ణమి ఉత్సవాలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, మే 4 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూరులో చిత్రాపౌర్ణమి రోజైన ఈ నెల 12న యాగశాలలో 12 గంటలపాటు విశేష పూజలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం గురుపూజ, విఘ్నేశ్వరపూజ, శక్తిపూజలు చేశారు.. మేల్‌మరువత్తూరు ఆది పరాశక్తి పీఠం నిర్వాహకులు శ్రీదేవి బంగారు సారథ్యంలో జరిగిన ఈ పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఆలయంలో వచ్చే ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు అమ్మవారి అభిషేకంతో చిత్తిరై పౌర్ణమి ఉత్సవం ప్రారంభమవుతుంది. మే 12 సోమవారం పీఠం నిర్వాహకులు అన్బలగన్, సెందిల్‌కుమార్, లక్ష్మి బంగారు అడిగలార్ సారథ్యంలో యాగపూజలను ప్రారంభిస్తారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థ రాష్ట్ర రవాణా సంస్థలు పలు ప్రాంతాలనుంచి మేల్‌మరువత్తూరుకు ప్రత్యేక బస్సు నడుపనున్నట్లు ప్రకటించాయి.

తిరుత్తణి ఆలయానికి పోటెత్తిన భక్తులు



తిరుత్తణి, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన తిరుత్తణి మురుగన్ క్షేత్రంలో చిత్తిరై ఉత్సవాల సందర్భంగా ఆదివారం తెల్లవారుజాము నుండే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి పోటెత్తారు. విద్యాసంస్థలకు వేసవి సెలవులు, ఉద్యోగులు, వ్యాపారులకు వారాంతపు సెలవులు రావడటం, ఆదివారం అగ్నినక్షత్రం ప్రారంభం కూడా తోడవటంతో వేల సంఖ్యలో భక్తులు తిరుత్తణి మురుగన్ దర్శనానికి తరలివచ్చారు. ఆదివారం వేకువజాము నుండే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆదివారం మధ్యాహ్నం 3.45 గంటలకు హఠాత్తుగా వర్షం కురవడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. తిరుత్తణి ఆలయంలోని కల్యాణమండపాలలో వివాహాలు కూడా జరిగాయి.

మదురై ఆధీనంపై హత్యాయత్నం జరగలేదు

- స్పష్టం చేసిన కళ్లకుర్చి పోలీసులు

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): మదురై ఆధీనంపై హత్యాయత్నం జరిగినట్లు కనిపించడం లేదని, ఆయన ప్రయాణించిన కారు అతివేగంగా వెళ్లిన సమయంలో ప్రమాదం జరిగినట్లు తెలిసిందని కళ్లకుర్చి జిల్లా పోలీసులు వివరణ ఇచ్చారు. ఉళుందూర్‌పేట సమీపంలోని ప్రమాదం జరిగిన అనంతరం, తనను ప్రణాళిక ప్రకారం హత్య చేయాలనే కుట్ర జరిగిందని, దీని వెనుక పాకిస్తాన్ ప్రమేయం ఉన్నట్లు మదురై ఆధీనం ఆరోపించారు. ఈ నేపథ్యంలో, కారు ప్రమాద దృశ్యాలకు సంబంధించిన సీసీ ఫుటేజీని ఆదివారం కళ్లకుర్చి జిల్లా పోలీసులు విడుదల చేశారు.

ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లిన బస్సు




కాలువలోకి కుంగిన బస్సు చక్రం

తిరుత్తణి, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని అన్నా బస్టాండు నుంచి ప్రభుత్వ బస్సు బయలుదేరుతుండగా అదుపుతప్పి ఫుట్‌పాత్‌పైకి వెళ్ళింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రమాదం జరగనప్పటికీ ఫుట్‌పాత్ పై ఉన్న దుకాణం పూర్తిగా ధ్వంసమైంది. ఇదిలా వుండగా, బస్సును వెనక్కితీసే ప్రయత్నంలో పుట్‌పాత్‌పై పగుళ్లు ఏర్పడి బస్సు వెనుక చక్రం కాలువలోకి దిగిపోయింది. విషయం తెలుసుకున్న రవాణా శాఖ ఉద్యోగులు అక్కడికి చేరుకుని మరో బస్సు సహాయంతో సుమారు గంట సేపు శ్రమంచి కాలువలో కూరికుపోయిన ఆ బస్సును బయటికి తీశారు.

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు చట్ట సవరణను వ్యతిరేకిస్తూ దాఖలైన కేసులో డీఎంకే తరపున సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలుచేశారు. కేంద్ర ప్రభుత్వ వాదనలు వాస్తవాలకు వ్యతిరేకంగా ఉందని డీఎంకే కౌంటర్ అఫిడివిట్‌లో ఆరోపించింది. కేంద్ర ప్రభుత్వ వాదనలు నిరాకరించి వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు నిషేధం విధించాలని డీఎంకే విజ్ఞప్తి చేసింది.



గోపుర కలశాలపై సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

గర్భాలయ విమాన కలశంపై సంప్రోక్షణ

కుంభాభిషేకానికి హాజరైన భక్తజనం

పాపనాశం ఆలయంలో ఘనంగా మహాకుంభాభిషేకం



రాజగోపురానికి చేతులెత్తి మొక్కుతున్న భక్తులు

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాలో సుప్రసిద్ధ పాపనాశం అరుళ్‌మిగు ఉలగమ్మయ్ సమేత పాపనాశ స్వామి ఆలయ మహాకుంభాభిషేకం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. అగస్త్య మహర్షిని అనుగ్రహించేందుకు ఈ క్షేత్రంలో పరమేశ్వరుడు, పార్వతిదేవి కల్యాణశోభతో ఆయనకు దర్శనమిచ్చినట్లు స్థలపురాణం చెబుతుంది. ఇంతటి విశేషాలతో కూడిన ఈ ఆలయం సూర్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఈ ఆలయ మహాకుంభాభిషేకం సందర్భంగా ఏప్రిల్ 27 నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈనెల 1న ప్రథమ కాల యాగ పూజ, 2న ఉదయం ద్వితీయకాల యాగపూజ, అదే రోజు సాయంత్రం తృతీయ కాల యాగపూజ, 3న ఉదయం చతర్థ కాల యాగపూజ, రాత్రి పంచమ కాల యాగపూజలు నిర్వహించారు. ఆదివారం వేకువజాము ఆరో కాల యాగ పూజ జరిపారు. ఆ యాగశాల వద్ద పవిత్ర నదీ జలాల కలశాలను శైవ పండితులు, అర్చకులు ఊరేగింపుగా ఆలయ రాజగోపురం, వివిధ సన్నిధుల గోపురాపైకి తీసుకెళ్ళారు. వేదపండితుల మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ రాజగోపురం కలశాలపై పవిత్ర నదీ జలాలతో సంప్రోక్షణ, మహా అభిషేకం నిర్వహించారు. ఆలయ రాజగోపురం పై నుండి శైవపండితులు డ్రోన్ల ద్వారా సంప్రోక్షణ తీర్థజలాలను భక్తులపై చల్లారు. ఈ ఆలయానికి 2005 సెప్టెంబర్‌లో కుంభాభిషేకం నిర్వహించారు. 19 యేళ్ల తర్వాత ఆదివారం మళ్ళీ ఈ ఆలయానికి మహాకుంభాభిషేకం చేపట్టారు. ఈ వేడుకలను తిలకించేందుకు తిరునల్వేలి, తెన్‌కాశి, విరుదునగర్, మదురై సహా పలు జిల్లాల నుండి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. కుంభాభిషేక కార్యక్రమంలో తిరునల్వేలి జిల్లా కలెక్టర్ సుకుమార్, ఎస్పీ సిలంబరసన్, జిల్లా రెవెన్యూ అధికారి సుకన్య, అంబాసముద్రం శాసనసభ్యుడు ఇసక్కి సుబ్బయ్య, సోకో సంస్థ డైరెక్టర్ శ్రీధర్ వేంబు, మాజీ స్పీకర్ ఆవుడయప్పన్ తదితరులు పాల్గొన్నారు.

కపాలీశ్వరాలయంలో వైభవంగా వసంత్ ఉత్సవ్

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూరు కపాలీశ్వరాలయంలో సరస్వతి విద్యా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో వసంత్ ఉత్సవ్-2025 పేరుతో సంగీత నాట్యోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనితా సుమంత్, ఢిల్లీ మౌలానా ఆజాద్ వైద్యకళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జగత్ మోహినీ కౌల్ ముఖ్య అతిథులుగా హాజరై ఈ వేడుకలను ప్రారంభించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, మాజీ ఐఏఎస్ అధికారి గరియాలి, కార్యదర్శి ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు. ఆ సందర్భంగా పద్మశ్రీ మీనాక్షి చిత్తరంజన్‌కు ఇందిరా గరియాలి పురస్కారం, నాట్యకళారత్న అవార్డు ప్రదానం చేశారు. సంఘ సేవకులు శ్రీవిజయ్‌మోహన్ కౌల్, అశుతోష్ రెయాని, వేద పండితులు రాజ్‌కుమార్ జోషికి కాశీనాథ్ గరియాలి అవార్డులు ప్రదానం చేశారు. ఈ వేడుకలు ఈ నెల 11 వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



పురస్కార గ్రహీతలతో ఫౌండేషన్ నిర్వాహకులు, తదితరులు

'రెటికాన్' సదస్సులో నేత్ర వైద్యంలో చికిత్సపై సమీక్ష

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి నేత్ర వైద్యంలో పేరుపొందిన డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆదివారం ఉదయం రెటికాన్ 2025 సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో నేత్ర వైద్యంలో ఇటీవల కాలంలో వచ్చిన మార్పు లు, నూతన చికిత్సా విధానాలపై సమగ్రంగా చర్చించారు. చెన్నై నార్త్ లోక్‌సభ సభ్యుడు డాక్టర్ కళానిధి వీరాసామి ప్రారంభించిన ఈ సదస్సులో దేశ విదేశాలకు చెందిన సుమారు 1500 మంది నేత్ర వైద్యనిపుణులు, పోస్టుగ్రాడ్యుయేట్లు పాల్గొన్నారు. డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ అమర్ అగర్వాల్, చీఫ్ క్లినికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విన్ అగర్వాల్, డాక్టర్ మనోజ్ ఖాత్రీ, డాక్టర్ పర్వీన్ సేన్, డాక్టర్ పద్మా ప్రీతా, డాక్టర్ త్రివేణి తదితరులు హాజరయ్యారు.



ఎంపీ డాక్టర్ కళానిధి వీరాసామికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రొఫెసర్ అమర్ అగర్వాల్, డాక్టర్ మోహన్‌రాజన్ తదితరులు



కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న భక్తులు

భక్తులతో కిక్కిరిసిన కారైక్కాల్

● ఘనంగా అమ్మయార్ ఆలయ కుంభాభిషేకం

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): అరుపత్తుమువ్వర్ నాయన్మార్లలో మహిళా నాయన్మార్‌గా కీర్తిగడించిన కారైక్కాల్ అమ్మయార్ ఆలయ మహాకుంభిషేక వేడుకలు ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ ఆలయంలో ప్రతియేటా అమ్మవారి జీవిత విశేషాలను తెలిపేలా మామిడి ఫలాల ఉత్సవం ఘనంగా జరుగుతుంది. ఇంతటి విశేషాలు సంతరించుకున్న ఆ ఆలయంలో 17 యేళ్ల విరామం తర్వాత మహాకుంభాభిషేక వేడుకలు నిర్వహించారు. ఈ నెల 1న ఆలయంలో త్రికాల పూజలు ప్రారంభమయ్యాయి. ఆదివారం వేకువజాము యాగశాల పూజలు నిర్వహించారు. ఆ తర్వాత యాగశాలల వద్ద ఉంచిన పవిత్ర నదీజలాల కలశాలను వేదపండితులు ఊరేగింపుగా తీసుకెళ్ళి ఆలయ రాజగోపురంపై సంప్రోక్షణ చేశారు. శైవాచార్యుల మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ ఈ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలలో సుమారు మూడువేల మందికిపైగా భక్తులు విచ్చేశారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



రథోత్సవం

ప్యారీస్, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేట కొండితోపు సమీపంలోని ముల్లావీధిలో వెలసిన రంగనాథస్వామి ఆలయంలో ఉడయవర్ల చిత్తిరై వేడుకలు కోలాహలంగా జరుగుతున్నాయి. తొమ్మిదో రోజు శుక్రవారం ఉత్సవమూర్తుల రథోత్సవం, చివరి రోజు శనివారం రాత్రి శ్రీరామ పట్టాభిషేకం, ఊరేగింపు నేత్రపర్వంగా సాగాయి. పట్టాభిషేకం సందర్భంగా సీతారామలక్ష్మణ సమేత అంజనేయస్వామివార్లను పట్టు పీతాంబరాలు, వజ్రాలు పొదిగిన మాలలతో విశేషంగా అలంకరించి ఆలయ ప్రధాన మండపంలో కొలువుదీర్చారు. మేళతాళాలు, వేదమంత్రోచ్చారణల మధ్య వైష్ణవ గురువులు రామయ్య పట్టాభిషేకాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జె.హరికుమార్ పర్యవేక్షణలో 10 రోజులు నిర్వహించిన ఈ ఉత్సవంలో ప్రతిరోజు ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, వివిధ వాహనాలు, రథంపై పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులందరికీ ఉదయం, సాయంత్రం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



శ్రీరామ పట్టాభిషేకం

కోలాహలంగా చేపలు పట్టే వేడుక



చేపలు పడుతున్న గ్రామస్తులు

పెరంబూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): నత్తం సమీపం ఏట్టయాంపట్టి గ్రామంలో జరిగిన చేపలు పట్టే వేడుకల్లో సుమారు వెయ్యి మందికి పైగా పాల్గొన్నారు. దిండుగల్ జిల్లా నత్తం సమీపంని ఏట్టయాంపట్టి గ్రామంలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. వర్షాలకు ప్రారంభం ముందు చెరువులో చేప పిల్లలు వదులుతుంటారు. ప్రతి ఏడాది సాగుపనులు ముగిసి, చెరువులో నీరు తగ్గిన సమయంలో చేపలు పట్టే వేడుకలు నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం చెరువులో నీరు తగ్గడంతో వేడుకలు నిర్వహించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. ఈ వేడుకల్లో నత్తం, సిరుకుడి, కోట్టాంపట్టి, పొరుగు జిల్లాలైన శివగంగ, పుదుకో, తిరుచ్చిలోని పలు గ్రామాల నుంచి సుమారు వెయ్యి మందికి పైగా హాజరయ్యారు. గ్రామ పెద్ద జెండా ఊపిన వెంటనే అప్పటికే పిల్లల నుంచి పెద్దల వరకు ఒక్కసారిగా చెరువులో దిగి చేపల వేట చేపట్టారు. జిలేజి, కురవై సహా పలురకాల చేపలు లభించాయి.

వాసవీ లక్షార్చన పూజలు ప్రారంభం

ప్యారీస్, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్ ఆదియప్ప వీధిలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో వాసవీ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన మూడు రోజుల లక్షార్చన ఆదివారం ఉదయం ప్రారంభమైంది. ఆలయ ప్రధాన మండపంలో కూర్చున్న భక్తులు పూజా సామగ్రి, తులసీ దళాలతో అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని బంగారు ఆభరణాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. బుధవారం వాసవీ జయంతి సందర్భంగా ఉదయం 6 గంటలకు చేట్‌పేటలోని ఎస్‌కేపీడీ హాస్టల్ సమీపంలో 'వాసవీ జ్యోతియాత్ర' ప్రారంభమై గోవిందప్పనాయకన్ వీధిలో వున్న ఎస్‌కేపీడీ బాలల మహోన్నత పాఠశాలకు చేరుకుంటుంది. నగరంలోని పలు ప్రాంతాలనుంచి పాల కలశాలతో ఊరేగింపుగా పాదయాత్రగా బయలుదేరిన భక్తులు సమర్పించే పాలతో వాసవాంబకు క్షీరాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం మూలమంత్ర హోమం, మధ్యాహ్నం మహాదీపారాధన, ప్రసాద వినియోగం, సాయంత్రం 6 గంటలకు సాయి రాగమాలికా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తపాటల సంగీత కార్యక్రమం, 7.30 గంటలకు విశేష దీపారాధన నిర్వహించనున్నట్లు ఎస్‌కేపీడీ ధర్మకర్త, మేనేజ్‌మెంట్ కమిటీ తెలిపింది.



పూజలో పాల్గొన్న భక్తులు

సీనియర్ నటి పెరుమాయి కన్నుమూత

ప్యారీస్, మే 4 (ఆంధ్రజ్యోతి): యువహీరోలు విజయ్, శివకార్తికేయన్ తదితరులతో నటించిన పెరుమాయి (73) ఆదివారం గుండెపోటుతో కన్నుమూశారు. మదురై జిల్లా ఉసిలంపట్టి సమీపంలోని అన్నంబారిబట్టి గ్రామానికి చెందిన పెరుమాయి ప్రముఖ దర్శకుడు భారతీరాజా దర్శకత్వం వహించిన పెరికత్తిపొన్ను చిత్రం ద్వారా తమిళ చిత్రరంగంలో పరిచయమయ్యారు. ఆమె భారతీరాజా దర్శకత్వం వహించిన పలు చిత్రాల్లో వృద్ధురాలి పాత్రలో నటించారు. విజయ్ నటించిన విల్లు, శివకార్తికేయన్ నటించిన మనంకొత్తిపరవై తదితర 30కి పైగా చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించారు. చివరగా నటుడు పశుపతి పాండియన్‌తో దండట్టి చిత్రంలో కూడా నటించారు. అనారోగ్యం కారణంగా ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ ఆదివారం గుండెపోటుతో మరణించిన పెరుమాయికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



నటి పెరుమాయి (ఫైల్‌ఫొటో)

చిత్రజ్యోతి

యోగిబాబుతో ఏ సమస్యా లేదు

● 'గజానా' దర్శకుడు ప్రగదీశ్



'గజానా' చిత్ర బృందం

ప్రముఖ నటుడు యోగిబాబు షూటింగులకు సక్రమంగా రాకుండా దర్శక నిర్మాతలను ఇబ్బంది పెడుతున్నారనే ప్రచారాన్ని 'గజానా' చిత్ర దర్శకనిర్మాత ప్రగదీశ్ శామ్స్ ఖండించారు. మా చిత్రం షూటింగ్ సమయంలో ఆయన అద్భుతమైన సహకారం అందించారని వెల్లడించారు. ఫోర్ స్క్వేర్ స్టూడియోస్ పతాకంపై ప్రగదీశ్ శామ్స్ నిర్మించి, దర్శకత్వం వహించిన చిత్రం 'గజానా' ఈ నెల 9వ తేదీ విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని చిత్ర బృందం ఆడియో, ట్రైలర్‌ను తాజాగా రిలీజ్ చేసింది.ఇందులో దర్శక నిర్మాత ప్రగదీశ్ శ్యామ్స్ మాట్లాడుతూ, 'సినిమా పూజా కార్యక్రమం దగ్గర నుంచి ఇప్పటివరకు యోగిబాబు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించారు. ఆయన మరో చిత్రం షూటింగ్‌లో ఉన్నందున ఈ ట్రైలర్ రిలీజ్‌కు హాజరుకాలేకపోయారు. ఈ విషయాన్ని కూడా ఆయన ముందుగానే మాకు చెప్పారు.అయితే ఎవరూ ఊహించని విధంగా నిర్మాతల సంఘం కార్యవర్గ సభ్యుడు రాజా నటుడు యోగిబాబు గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.ఆయన మాట్లాడిన ప్రతి మాట ఆయన వ్యక్తిగతం. నిర్మాతల సంఘం సమస్యకు, మా చిత్రానికి ఎలాంటి సంబంధం లేదు. ఈ చిత్రం రెండో భాగంలో కూడా యోగిబాబు మరో ముఖ్య పాత్రను పోషించనున్నారు' అని పేర్కొన్నారు.

శింబు - సంతానం నటిస్తున్న 'ఎస్‌టీఆర్ 49' ప్రారంభం



సంతానం - సింబు

వెండితెరపై హీరో శింబు, సంతానం కాంబినేషన్ రిపీట్‌కానుంది. సంతానంను 2004లో 'మన్మథన్' చిత్రంలో హాస్య నటుడిగా శింబు వెండితెరకు పరిచయం చేశారు. ఆ తర్వాత సంతానం అతి తక్కువ కాలంలోనే ఉన్నత స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం హీరోగా వరుస సినిమాల్లో నటిస్తూ ఎంతో బిజీగా ఉంటున్నారు. బిజీగా ఉన్నా శింబు నుంచి పిలుపురాగానే 'ఎస్‌టీఆర్49'లో కామెడీ పాత్ర పోషించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ చిత్రం పూజా కార్యక్రమం శనివారం నగరంలో జరిగింది. ఇందులో హీరో శింబు, హీరోయిన్ కయాదు లోహర్, నటులు సంతానం, వీటీవీ గణేశ్ తదితరులు పాల్గొన్నారు. రామ్‌కుమార్ బాలకృష్ణన్ దర్శకత్వం వహిస్తున్నారు. తనను వెండితెరకు పరిచయం చేసిన హీరో సింబు కోసం.. తనకున్న హీరో ఇమేజ్‌ను పక్కనబెట్టి... 'ఎస్‌టీఆర్49'లో కామెడీ రోల్ చేసేందుకు ముందుకు వచ్చిన సంతానంను దర్శక నిర్మాతలతో పాటు చిత్ర బృందం ప్రత్యేకంగా అభినందిస్తుంది.

'తలైవన్ తలైవి'గా విజయ్ సేతుపతి - నిత్యా మేనన్



'తలైవన్ తలైవి'లో విజయ్ సేతుపతి - నిత్యా మేనన్

విజయ్ సేతుపతి - నిత్యా మేనన్ జంటగా పాండిరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'తలైవన్ తలైవి' అనే పేరు ఖరారు చేశారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని నిర్మాణాంతర పనులను జరుపుకుంటోంది. సీనియర్ నిర్మాత టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్యజ్యోతి ప్రొడక్షన్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం. దర్శకుడు పాండిరాజ్ - సంతోష్ నారాయణన్ కాంబినేషన్‌లో వస్తున్న తొలి చిత్రం ఇదేకావడం గమనార్హం. ఇతర పాత్రల్లో యోగిబాబు, సెంబియన్ వినోద్ తదితరులు నటించగా టైటిల్, టీజర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ భార్యాభర్తలుగా నటించారు. వీరిద్దరూ పరోటా ఆరగిస్తూనే మాటల యుద్ధానికి దిగుతారు. వారినుద్దేశించి యోగిబాబు చెప్పే వన్‌లైన్ డైలాగ్ కూడా సూపర్బ్‌గా ఉంది. వీటితో పాటు తుపాకీ కాల్పులు, యాక్షన్ సన్నివేశాలతో ఈ టీజర్ కట్ చేశారు.

దీపావళి రేసులో 'బైసన్'



'బైసన్'లో ధృవ్ విక్రమ్

చియాన్ విక్రమ్ కుమారుడు ధృవ్ విక్రమ్ నటిస్తున్న 'బైసన్' చిత్రం దీపావళికి విడుదల చేయనున్నట్టు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించే ఈ చిత్రంపై కోలీవుడ్‌లో భారీ అంచనాలున్నాయి. స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ మూవీని అక్టోబరు 17న థియేటర్లలో రిలీజ్ చేయనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైనమెంట్, నీలం స్టూడియోస్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. హీరోయిన్‌గా అనుపమ పరమేశ్వరన్ నటించగా, ఇతర పాత్రల్లో దర్శకుడు అమీర్, లాల్, పశుపతి, రజిషా విజయన్ కీలక పాత్రలను పోషిస్తున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్ మూవీ జర్నీలో ఈ చిత్రం ఒక మైలురాయిగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఈ సంస్థ నుంచి పలు చిత్రాలు విభిన్నమైన కథాంశం, ఆకట్టుకునే స్క్రీన్‌ప్లే, అద్భుతమైన సాంకేతిక కళాకారుల పనితనంలో ప్రేక్షకుడు సరికొత్త అనుభూతిని పొందేలా చిత్రాలను రూపొందిస్తుంది. అలాంటి వైవిధ్య భరితమైన కథాంశంతోనే ఈ చిత్రాన్ని కూడా దర్శకుడు మారి సెల్వరాజ్ రూపొందిస్తున్నారు.